క్లుప్తంగా

డీవీఈఓ మంజులా వీణకు అభినందనలు



డీవీఈఓ మంజులా వీణను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

పార్వతీపురంటౌన్: విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా డీవీఈఓ మంజులావీణను బలిజిపేట కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, సిబ్బంది పార్వతీపురం డీవీఈఓ కార్యాలయంలో సోమవారం అభినందించారు. ఉత్తమ అధ్యాపకురాలిగా రాష్ట్రస్థాయి ఆమె అవార్డు అందుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీతంనాయుడు, గోపీకృష్ణ, వాసు, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ అమరవీరులకు ఘనంగా నివాళి



అమర వీరుల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఎఫ్ఓ ప్రసూన

పార్వతీపురం టౌన్: అటవీ సంపదను రక్షించే ప్రయత్నంలో అమరులైన ఆ శాఖ అధికారుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం జిల్లా అటవీశాఖాధికారిణి స్థానిక అటవీశాఖ కార్యాలయం వద్ద వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ సంపద, వన్య ప్రాణి సంరక్షణలో ఉద్యోగులు వృత్తిని దైవంగా భావించి ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్వతీపురం రేంజ్ అధికారి త్రినాథ, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



జీవామృతం, పంచగవ్య సేంద్రియ ఎరువు తయారీపై అవగాహన కల్పిస్తున్న ట్రైనీ ఏఓలు

సీతానగరం: పంటలను పరిశీలిస్తూ ప్రకృతి వ్యవసాయం చేయడంపై రైతుల్లో అవగాహన కల్పిస్తామని, రైతుల అనుభవాలను స్వీకరిస్తామని సెంచూరియన్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న పర్లాకిమిడికి చెందిన స్వామినాథన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ట్రైనీ ఏఓలు సీహెచ్ అనిత, ఆర్ గ్రీవన్య, ఎస్ స్పందన అన్నారు. ఈ మేరకు సోమవారం వారు సీతానగరం మండలం, పెదభోగిలిలో వరి, చెరకు పంటల రైతులను కలిసి ప్రకృతి వ్యవసాయం చేయడం, తెగులు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, జీవామృతం, పంచగవ్య ఎరువుల తయారు అంశాలపై అవగాహన కల్పించారు.

పుస్తెలతాడు చోరీ

గరుగుబిల్లి: మండలంలోని చినగుడబ గ్రామానికి చెందిన ముడిల రజనీకుమారికి చెందిన పుస్తెలతాడు చోరీకి గురైనట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రాజేష్ సోమవారం తెలిపారు. రజనీకుమారి తన తండ్రి వెంకటరమణ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మెడలోవున్న సుమారు మూడున్నర తులాల పుస్తెల తాడును సుమారు రాత్రి మూడు గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకు పోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు ఎస్సై రాజేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



బాలేరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న రొక్కం రామారావు, చలపతిరావు

భామిని: మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. మండలంలో మొదటి విడతలో కొత్తగా 93 పింఛన్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. బాలేరులో వైఎస్సార్‌సీపీ నాయకులు రొక్కం రామారావు, మేడిబోయిన చలపతి సోమవా రం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. సచివాలయం పరిధిలో కొత్తగా 9 మందికి పింఛన్లు మంజూరైనట్లు కార్యదర్శి కె.సత్యవతి తెలిపారు. అలాగే బత్తిలి, భామినిలో కొత్తగా మంజూరైన పింఛన్లను స్థానిక నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర
- దింసా నృత్యంతో స్వాగతం పలికిన గిరిజనులు



దింసా నృత్యం చేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

మక్కువ:

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ తెలగడవలస, బొడ్డుసామంతవలస, బట్టివలస, కాకువానివలస, కాపుగైశీల, కేంద్రుకగైశీల, పాతగైశీల గ్రామాలలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు గిరిజన మహిళలు దింసా నృత్యంతో స్వాగతం పలికారు. మంత్రి రాజన్నదొర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేయడంతో ఆ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది. ఉదయం భానుడి భగభగల మధ్య.. సాయంత్రం జోరువానలోనూ కార్యక్రమం కొనసాగించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుతో పాటు ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలగడవలసలో తాగునీటి సమస్య ఉందని గ్రామస్తులు తెలియజేయగా... వెంటనే మంత్రి రాజన్నదొర ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జోగారావును పిలిచి సమస్య వివరించారు. దీనికి ఏఈఓ స్పందిస్తూ వాటర్‌ట్యాంక్ నిర్మించేందుకు రూ.15 లక్షలు మంజూరయ్యాయని, టెండర్లు పూర్తికాగానే పనులు చేపడతామన్నారు. అలాగే బొడ్డుసామంతవలసలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు చెప్పగా.. నాడు - నేడు ఫేజ్-3లో అదనపు భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ సత్యనారాయణను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ మెల్లిక రాములమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంట సంజీవునాయుడు, తేలు శ్రీరాములు నాయుడు, బొత్స అప్పలనాయుడు, వేమూరి కోటేశ్వరరావు, కోట్ల నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికు బుక్‌లెట్ అందిస్తున్న ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

జీజీఎంపీ పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న పీఆర్ డీఈ ఎం.రత్నకుమార్

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం జీజీఎంపీ(గడగడపకు మన ప్రభుత్వం) నిధులతో మంజూరు చేసిన సామాజిక పరమైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, చేస్తున్న పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండాలని పీఆర్ సబ్ డివిజన్ డీఈ ఎం రత్నకుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన సీతానగరం మండలంలోని అంటిపేట, వెన్నెల బుచ్చింపేట గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఏఈ చంద్రమౌళితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీజీఎంపీ నిధులతో అంటిపేట, వెన్నెల బుచ్చింపేట, వెంకటాపురం, కొత్తవలస గ్రామాల్లో రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రారంభించిన పనులు నిర్దేశించిన సమయానికి పూర్తి చేసి కొత్త పనులను ప్రారంభించడానికి సిద్ధం కావాలని కోరారు.

హోరాహోరీగా ఎస్‌జీఎఫ్ పోటీలు



పోటాపోటీగా కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణంలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు ఇందులో పాల్గొని కోకో, వాలీబాల్, కబడ్డీ తదితర పోటీల్లో తమ సత్తా చాటారు. ఇందులో ఎంపికైన వారు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు తెలిపారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ జి.బాబూరావు, పీఈటీ శివరామప్రసాద్ పోటీలను నిర్వహించారు.

దేరుగండకు రహదారి సౌకర్యం



రహదారి వేసేందుకు వీలుగా తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీ దేరుగండ గ్రామానికి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు భద్రగిరి గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం ఏఈ ఎస్.అప్పారావు తెలిపారు. డిపార్ట్‌మెంట్ ప్రొసీజర్ పూర్తయిన వెంటనే రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడేవాళ్లమని, ఇప్పుడు రోడ్డు వస్తుందని తెలియడంతో తమ సమస్యకు పరిష్కారం దొరికిందని దేరుగండ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే గ్రామస్తులంతా చందాలు వేసుకుని కొంత మొత్తాన్ని సేకరించి ఆ డబ్బులతో ఎగువ తాడికొండ నుంచి దేరుగంగ వరకు రోడ్డు వేసేందుకు అనువైన మార్గాన్ని సోమవారం జేసీబీ సాయంతో బాగుచేయించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష షెడ్యూల్ తయారు చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న ఫ్యామిలీ డాక్టర్, టీబీ స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ టి.రమేష్

- ఫ్యామిలీ డాక్టర్ నోడల్ అధికారి డాక్టర్ టి. రమేష్

పార్వతీపురంటౌన్: జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం షెడ్యూల్ తయారు చేయాలని ఫ్యామిలీ డాక్టర్, టీబీ ప్రోగ్రాం స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ టి.రమేష్ సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందితో పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ నెలాఖరు నుంచి జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముందస్తుగా ఏ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు, మండలాల వారిగా టీమ్‌లు, ప్రోగ్రాం జరిగే వేదికలు, జరిగే తేదీలు, షెడ్యూల్ ప్రకారం వేస్తున్న స్పెషలిస్టు వైద్యులు, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది తదితర అంశాలను పరిశీలించి చర్చించారు. అనంతరం డీఎంహెచ్‌ఓతో కలిసి లక్ష్మీనారాయణపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని తనిఖీ చేశారు.

కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.టి.జగన్మోహన్ రావు, ఎఫ్‌డీపీ నోడల్ అధికారి వినోద్ కుమార్, జిల్లా క్షయ నివారణ అధికారి శ్యామ్ కుమార్, వైద్యాధికారిణి ధరణి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

24న పద్యపఠన పోటీలు

రాజాం సిటీ: స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో ఈ నెల 24వ తేదీన నియోజకవర్గ స్థాయి పద్యపఠన పోటీలు నిర్వహించనున్నామని వికాస తరంగిణి కేంద్ర సమన్వయకర్త టి.టి.వి.రమణమూర్తి తెలిపారు. సోమవారం ఈ పోటీలకు సంబంధించి, రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించి, ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు కూడా కరపత్రంలో ముద్రించిన పద్యాలు మాత్రమే సాధన చేసి, ప్రదర్శించాలన్నారు. 4, 5 తరగతుల విద్యార్థులు కోరిన పద్యాన్ని చెప్పాలని, 6, 7 తరగతుల విద్యార్థులు కోరిన పద్యంతో పాటు దాని భావం కూడా చెప్పాల్సి ఉంటుందన్నారు.

నెరవేరిన దశాబ్దాల కల...

- మంత్రి రాజన్నదొర చొరవతో పూర్తయిన మోసూరు వంతెన
- రూ.7.60 కోట్లతో నిర్మాణం
- త్వరలోనే ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన మోసూరు వంతెన

సాలూరు: పాచిపెంట మండలంలోని సుమారు 15 గిరిజన గ్రామస్తుల దశాబ్దాల నాటి కల నేరవేరింది. వట్టిగెడ్డ పైనుంచి రాకపోకలకు శాశ్వత పరిష్కారం లభించింది. మండలంలోని మోసూరు, గంగందొరకోనవలస, సురగడవలస, రాయిగుడ్డివలస, గుమ్మిడిగుడ, పుల్లేరుగుడ్డి, తదితర 15 గ్రామాల్లో సుమారు ఐదు వేలకు పైగా ప్రజలున్నారు. ఆయా గ్రామాల ప్రజలు బయట ప్రాంతాలకు రావాలంటే తప్పనిసరిగా వట్టిగెడ్డ దాటాల్సిన పరిస్థితి. చిన్న చినుకు పడినా ఆయా గ్రామాలకు బయట ప్రాంతాల నుంచి రాకపోకలు నిలిచిపోతాయి. వట్టిగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో చాలాసార్లు మనుషులు, వాహనాలు కొట్టుకుపోయిన సంఘటనలున్నాయి. వాస్తవానికి వట్టిగెడ్డపై ఉన్న ఒక వంతెన శిథిలావస్థకు చేరుకుంది. పైగా వంతెన పైనుంచి నీరు పారుతుంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో గిరిజనుల కష్టాలను స్వయంగా తెలుసుకున్న మంత్రి పీడిక రాజన్నదొర వంతెన ఏర్పాటు ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పీఆర్ ప్రాజెక్ట్ ద్వారా ఆర్‌సీపీఎ ల్‌డబ్ల్యూఈ (రోడ్ కనెక్టవిటీ ప్రాజెక్ట్ లెఫ్టవింగ్ ఎక్స్‌ట్రిమిస్ట్ ఎఫెక్టెడ్ ఏరియా) కింద సుమారు 7 కోట్ల 60 లక్షలు రుపాయలతో వంతెన మంజూరు చేయించారు. పనులు కూడా త్వరితగతిన జరిగేలా పర్యవేక్షణ చేయడంతో వంతెన త్వరగా పూర్తయింది. త్వరలో వంతెనను ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నట్లు ఎంపీపీ బడ్నాన ప్రమీల, సర్పంచ్ గండిపల్లి చంటి తెలిపారు.

ధన్యవాదాలు

మోసూరు, తదితర 15 గ్రామాలకు చెందిన సుమారు 5 వేల మంది ప్రజలకు మేలు జరిగేలా వంతెన ఏర్పాటు చేసినందుకు ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు ధన్యవాదాలు. వర్షం పడితే వట్టిగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. వంతెన ఏర్పాటుతో ఇబ్బందులు తొలగాయి.

– గండిపల్లి చంటి, సర్పంచ్, మోసూరు, పాచిపెంట మండలం

పూర్తి చేయించారు..

ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర ప్రత్యేక చొరవతో వంతెన పూర్తి చేయించారు. ఎన్నో ఏళ్ల నాటి సమస్యకు మోక్షం కల్పించారు. మోసూరుతో పాటు 15 గ్రామాల ప్రజల కష్టాలు తీరాయి. ముఖ్యమంత్రి గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. డిప్యూటీ సీఎం రాజన్నదొర సహకారం మరువలేం.

– బడ్నాన ప్రమీల, ఎంపీపీ, పాచిపెంట మండలం

వార్డుల్లో పనులు సకాలంలో పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: వార్డులలో చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. వార్డుల అభివృద్ధి ప్రగతిపై సోమవారం పురపాలక సంఘం సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన, వార్డుల కౌన్సిలర్ల సమక్షంలో 15 సచివాలయంలో పరిధిలో కార్యదర్శులు, మున్సిపల్ అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఒక్కో వార్డు పరిధిలో అభివృద్ధి కోసం రూ.40 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందేనన్నారు. ఇప్పటికే పురపాలక సంఘంలో గడపగడపకు కార్యక్రమాన్ని పూర్తిచేసి ఆయా వార్డుల పరిధిలో ప్రజల కోరిక మేరకు పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడమే కాకుండా అభివృద్ధి పనులు సైతం ఇప్పటికే చాలా వరకు ప్రారంభించినట్లు చెప్పారు.

వార్డులలో ప్రజల కోరిక మేరకు కొన్ని అభివృద్ధి పనులు ప్రారంభించారని, ఇంకా కొన్ని వార్డులలో పనులు ప్రారంభించని పరిస్థితి తన దృష్టికి వచ్చిందన్నారు. ఆలస్యం చేయకుండా అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్‌లు, హౌసింగ్ డీఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ అధికారులు ఈఈ, డీఈ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్య పరిరక్షణకు వ్యాక్సిన్



సీతానగరం పశువైద్య కేంద్రంలో వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: పశువుల ఆరోగ్య రక్షణకోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా సీతానగరం పశువైద్యశాఖ సబ్ డివిజన్ పరిధిలో బలిజిపేట, సీతానగరం మండలాల్లోని గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు ఏడీఏ డాక్టర్ సీహెచ్ దీనకుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలవద్ద, రూరల్ పశువైద్య కేంద్రాలలో పశువులకు అంటు వ్యాధులవారణకు వ్యాక్సిన్ వేస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో రెండు మండలాల పశువైద్యాధికారులు డాక్టర్ ఎస్ రామారావు, డాక్టర్ జి.గణేష్‌ల ఆధ్వర్యంలో గ్రామాల్లో లంపి స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు 29,600 పశువులకు వేయాలని నిర్ధారించగా ఇప్పటి వరకూ 26,178 పశువులకు టీకాలు వేశారని తెలిపారు. అలాగే 3,420 ఆడ దూడల(4 నెలల నుంచి 8 నెలలవయస్సులోపు)కు బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని నిర్ధారించగా ఇప్పటివరకు 1917 దూడలకు వేశామని తెలిపారు. పశువులకు అత్యవసర వైద్య సేవలందించడానికి, ఆస్పత్రుల్లో మందుల సరఫరాపై ప్రస్తావించగా రెండు మండలాల్లోని రైతు భరోసా కేంద్రాలు, డిస్పెన్సరీల్లో మందుల కొరతలేదని తెలియజేశారు.

పొలం గట్లపై కంది సాగు



పొలం గట్లపై నాటిన కందిమొక్కలు

సీతానగరం: ఖరీఫ్ వరి ఉభాలు పూర్తి కావడం, చేను ఏపుగా పెరగడంతో పొలం గట్లపై మండలంలోని రైతులు అధికాదాయం కోసం వ్యవసాయ శాఖ సమకూర్చిన కందివిత్తనాలను వేశారని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన బుడ్డిపేట, పెదభోగిలి గ్రామాల్లో పొలం గట్లపై రైతులు వేసిన కంది మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిచేను పంట కోతకు వచ్చే 15 రోజులకే కందిపంట కోతకు వస్తుందని, ప్రత్యేకించి ఎరువు వేయనవసరం లేదని చెప్పారు. పంటకు వేసే ఎరువు గట్లపై పడడం వల్ల కందిపంటక ఉపయోగపడి ఏపుగా పెరుగుతుందన్నారు. కంది విత్తనాలు గట్లపై వేయాలని, విత్తనాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలకు 70 మంది విద్యార్థులు



క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మక్కువ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలకు 70 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ములక్కాయవలస మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల ఆవరణలో సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలోని మూలక్కాయవలస మోడల్ స్కూల్ విద్యార్థులతో పాటు మక్కువ, వెంకటభైరిపురం, శంబర, ఎర్రసామంతవలస జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, కాశీపట్నం కేజీబీవీ విద్యార్థులు మొత్తం 70 మంది అండర్ -14, అండర్-17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, యోగా పోటీల్లో తలపడతారన్నారు. కార్యక్రమంలో మండల గేమ్స్ ఇన్‌చార్జ్ పి. మోహనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 24 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం గిరిజన స్పందన నిర్వహించారు. ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అర్జీలు స్వీకరించారు. మొత్తం 24న వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. కుడ్డపల్లికి చెందిన సవర తుంపమ్మ వ్యవసాయబోరు మంజూరు చేయాలని, సారవకోటకు చెందిన జగన్నాథరావు సామాజిక భవనం నిర్మాణ బిల్లు చెల్లించాలని, సీదిగూడకు చెందిన లక్కమ్మ వైఎస్సార్‌బీమా పథకం వర్తింపచేయాలని అధికారులను కోరారు. అలాగే భాషా వలంటీర్‌గా నియమించాలని జంబాడ గ్రామస్తుడు శివకుమార్, చింతాడకు చెందిన సవర సంతు పవర్ వీడర్ ఇప్పించాలని, తురాయిమానుగూడ గ్రామస్తులు కౌసల్య ఆశా వర్కర్ పోస్టు మంజూరు చేయాలని వినతులు అందజేశారు. కమ్యూనిటీహాల్ నిర్మించాలని గూనభద్ర గ్రామస్తుడు వెంకటరావు, తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని డోకులగూడ గ్రామస్తులు కోరారు.